బ్రహ్మాకుమారీల సేవలు విలువైనవి

- ఎమ్మెల్యే తలసాని

కంటోన్మెంట్: లాభాపేక్ష లేకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బ్రహ్మాకుమారీస్ సేవలు ఎంతో విలువైనవని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ లో బ్రహ్మాకుమారీస్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శాంతి భవన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సిక్ విలేజ్ లోని ఇంపీరియల్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నిత్యం అనేక పనులతో తీవ్ర ఒత్తిడులకు లోనయ్యే వారు రోజులో కొద్ది సమయం బ్రహ్మ కుమారీస్ కార్యక్రమాలలో పాల్గొంటే ఎంతో ఉపశమనం పొందుతారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. దేశ విదేశాలలో ఈ సంస్థ ద్వారా లక్షలాది మందికి విశేషమైన సేవలు అందిస్తూ మన్ననలను పొందుతున్నారని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు తనవంతు సహకారం, మద్దతు ఎల్లప్పుడూ అందించడానికి సిద్ధంగా ఉంటానని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, రిటైర్డ్ జడ్జి ఈశ్వరయ్య, కంటోన్మెంట్ మాజీ సభ్యుడు పాండుయాదవ్, రాజయోగిని బీ సంతోష్ దీదీ, రాజ్యోగిని బీ కులదీప్, రాజ్యోగిని బీకే సరోజిని, నితీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు తగదు

రాంగోపాల్‌పేట్: ప్రభుత్వం నుంచి తాము నిధులు తీసుకున్నామని కొంతమంది తప్పుడు ఆరోపణలు చేయడం తగదని ముత్యాలమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. దేవాలయ ప్రాంతంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు సంతోష్, కిరణ్, సాయిప్రకాశ్, కిషన్, ఎల్లేష్, వైష్ణవి, సోను మాట్లాడారు. ఈ నెల 14న దుండగుడు ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడని దీంతో వేద పండితులు, పెద్దల సూచనల మేరకు 15నుంచి 3 రోజుల పాటు శుద్ధి కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ విషయమై వివిధ హిందూ సంఘాలతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజల నుంచి తమకు మద్దతు లభించినా ప్రభుత్వం మాత్రం స్పందించలేదన్నారు. ఘటన జరిగిన రోజు స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ వచ్చి వివరాలు ఆరా తీశారని ఇన్‌చార్జి మంత్రి అందుబాటులో లేకపోవడంతో ఈ నెల 19న మినిస్టర్ క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కల్పించారని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి శ్రీగణేశ్ రూ.10 లక్షలు,



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాలమ్మ ఆలయ నిర్వాహకులు

ప్రభుత్వం తరఫున మరో రూ.10 లక్షలు అందిస్తామని హామీనిచ్చారని తెలిపారు. అయితే దీనిపై బస్తీ ప్రజల సమక్షంలోనే నిర్ణయం తీసుకుంటామని అక్కడికే రావాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. అంతేగానీ తాము డబ్బు తీసుకున్నట్లు కొంతమంది ఆరోపణలు చేయడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు.

24న మాదిగ విద్యార్థుల సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: కేయూలో ఈ నెల 24న మాదిగ విద్యార్థుల సదస్సు నిర్వహించనున్నట్లు ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ తెలిపారు. ఆదివారం ఓయూలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీస్ అధినేత మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు తెలంగాణ వర్సిటీల మాదిగ విద్యార్థుల సమావేశానికి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రఘువరన్, అజయ్, ఆదిత్య, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నార్త్‌జోన్ పరిధిలో వరుస ఘటనలు బాధాకరం

సనత్‌నగర్: ప్రశాంతంగా ఉండే నార్త్‌జోన్ పరిధిలో ఇటీవల వరుస ఘటనలు జరగడం బాధకరమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయ పరిధిలోని బస్తీవాసులు, పలువురు ప్రజాప్రతినిధులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పరిధిలోని ప్రజలు పలువురు పోలీసు బందోబస్తు, ఆందోళనల కారణంగా తాము పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహాన్ని దుండగుడు ధ్వంసం చేయడంతో వారంరోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయని, అదుపుతప్పకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కోరారు. దాని పరిష్కారం దిశగా కమిటీని ఏర్పాటు చేశారని, బస్తీవాసులతో సంప్రదింపులు జరుపుతుందని తెలిపారు. మంగళవారం బస్తీ ప్రజలు, ఆలయ కమిటీ, పండితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్లు టీ మహేశ్వరీశ్రీహరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, ఎన్.శేషకుమారి, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేషన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కాంప్లెక్స్ నిర్వహణ ప్రైవేట్‌కు అప్పగించొద్దు

అమీర్‌పేట: అమీర్‌పేట జీహెచ్ఎంసీ క్రీడా కాంప్లెక్స్ నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తామనడం సరికాదని అమీర్‌పేట కార్పొరేటర్ సరళ అన్నారు. టెండర్లు పిలవడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులతో కలిసి ఆందోళ చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.







ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బౌద్ధనగర్: ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యదర్శి మద్దెర్ల శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో వారాసిగూడలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు తమవంతు సహాయ సహకారాల్లో భాగంగా ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించి సేవలందించడం అభినందనీయమన్నారు. ఇదే విధంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద ప్రజలకు తమవంతు సేవ అందించాలన్నారు. శిబిరంలో జనరల్ హెల్త్ చెకప్, డయాగ్నస్టిక్స్ పరీక్షలు అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం, అవసరమైన వారికి ఉచితంగా మందులు, మాత్రలు కూడా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవిప్రసాద్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, జిలా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్శిగుట్ట వీరభద్రీయ కుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ హాజరై నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి బాబూరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మిట్టపల్లి ప్రతాప్ ,ప్రధాన కార్యదర్శిగా గండగత్తర వెంకటేశ్వర్లు, కోశాధికారిగా రావుల ఎల్లయ్య ఎన్నికయ్యారు.



ఆల్ట్రాసౌండ్‌తో రోగ నిర్ధారణ

అమీర్‌పేట: ఆల్ట్రాసౌండ్‌తో గైనకాలజికల్ కేన్సర్లను గుర్తించవచ్చని ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ మాలా సిబల్ అన్నారు. ఫెర్నాండెజ్ ఆసుపత్రి ఎడ్యుకేషన్, రీసర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్ట్రాసౌండ్‌లో పురోగతిపై సింపోజియం నిర్వహించారు. అమీర్‌పేట మారీగోల్డ్ హోటల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్త్రీ జననేంద్రియ పరిస్థితుల నిర్ధారణ, చికిత్సలో ఆధునిక అల్ట్రాసౌండ్ పద్ధతులను వివరించారు. దీనిద్వారా అండాశయ తిత్తులు, గర్భాశయంలో పెరుగుదల వంటి అసాధారణమ కేన్సర్‌ను ప్రారంభదశలనే గుర్తించే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గైనకాలజీ, రేడియాలజీ, పాథాలజీ నిపుణులకు అల్ట్రాసౌండ్‌ను వినియోగంపై తెలుసుకునే అవకాశం లభించిందని ఫెర్నాండెజ్ ఆసుపత్రి గైనకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఎస్.కామేశ్వరి అన్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 200 మంది ఆరోగ్య నిపుణులు పాల్గొన్నారు.

వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం ద్రోహం చేయడమే

బౌద్ధనగర్: ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం మాదిగలకు ద్రోహం చేయడమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ మాదిగల ధర్మయుద్ధ సమాయత్త సదస్సు బౌద్ధనగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాలులో డప్పు మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గోవిందు నరేష్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ మీద రేవంత్‌రెడ్డి మాటలు చెప్పి కోతలరాయుడిగా మిగిలిపోయాడన్నారు. కానీ హర్యానా ముఖ్యమంత్రి నయబ్ సింగ్ సైనీ ఎస్సీ వర్గీకరణను అమలు చేసి ఆచరణలో నిబద్ధతను చాటుకొని ప్రజా నాయకుడిగా మిగిలిపోయారన్నారు. అసెంబ్లీలో ఇచ్చిన హామీకి రేవంత్‌రెడ్డి విలువ ఇవ్వకపోతే మేనిఫెస్టో ఎలా అమలు చేస్తాడో తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 25 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లో మహాసభలు నిర్వహిస్తున్నామని, 30వ తేదీన హైద్రాబాద్‌లో నిర్వహించే సభను పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్పీ నాయకులు టీవీ. నరసింహరావు, నల్లిమెల విజయరావు, చెండేటి వేణుగోపాల్, కృష్ణ, దేవేందర్, సాయికుమార్, శ్రీనివాస్, గిరి, ఎడ్లరుద్రి, వసంత్, దినేష్, రఘు, శ్రీధర్, హరి, యాదగిరి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సదర్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా కొమ్ము అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు సంఘం నాయకులు ఆదివారం రాజ్య సభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌లను ఎమ్మెల్యే క్వార్ట్స్‌లోని వారి కార్యాలయంలో కలిశారు. ఈనెల 27న ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించతలపెట్టిన సదర్ ఉత్సవాలను నిర్వాహణపై అంజన్‌కుమార్ యాదవ్‌తో చర్చించారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ సదర్ ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జాతీయ నాయకులు అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్ తదితర నాయకులు హాజరవుతున్నారని తెలియజేశారు.



సికింద్రాబాద్ బంద్ ఘటనలో కేసుల నమోదు

రాంగోపాల్‌పేట్: ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శనివారం హిందూ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపులో జరిగిన దాడులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పాటు మూడు ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేశారు. అలాగే నిందితుడు బస చేసి హోటల్‌పై కూడా దాడికి దిగారు. డ్రైవర్లతో పాటు కొంతమంది పోలీసుల నుంచి ఫిర్యాదులు తీసుకుని మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో 4, గోపాలపురం స్టేషన్లో ఒక కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఆందోళనకారులను గుర్తించే పనిలో పడ్డారు. ఇప్పటికే సుమారు 10 మంది వరకు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది.

ముత్యాలమ్మ ఆలయం వద్ద కొనసాగుతున్న బందోబస్తు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయం వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. శనివారం బంద్ సందర్భంగా పోలీసుల లాఠీచార్జీ, ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడం లాంటి ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆలయానికి వెళ్లే రహదారులను బారికేడ్లతో మూసేసి కేవలం బస్తీవాసులను మాత్రమే అనుమతిస్తున్నారు. ఉత్తర మండలం పోలీసులతో పాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సాయుధ బలగాలు మోహరించాయి.



అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ

లాలాపేట: తార్నాక చింతల్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పలువురు దళిత సంఘాల నాయకులు ఆదివారం జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు. దళిత జాతి అభ్యున్నతికి, భారతదేశానికి అంబేడ్కర్ అందించిన సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో తుంగ లక్ష్మణ్, అంబాల రమేష్, చిన్న తదితరులున్నారు.



నేటి నుంచి ప్రారంభంకానున్న నిర్మాణ పనులు

అడ్డగుట్ట: నార్త్‌లాలాగూడలోని లిల్లీ మోడల్ స్కూల్ సమీపంలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులు నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. దాదాపు ఏడాది కాలంగా డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనుల కారణంగా తవ్విన రోడ్డుకు సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆదివారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురించడం జరిగింది. ఈ మేరకు స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి స్పందించారు. డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనుల కారణంగా కొంత జాప్యం, ఎన్నికల కోడ్ ఉన్నందు వల్ల మరికొంత జాప్యం జరిగిందని, అందువల్లనే రోడ్డు నిర్మాణ పనుల్లో ఆలస్యం జరిగిందన్నారు. సోమవారం నుంచి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..



లింగాని ప్రసన్నలక్ష్మి, కార్పొరేటర్

యోగాతో మానసిక ప్రశాంతత

రాంగోపాల్‌పేట్: యోగాతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని లయన్స్ డాక్టర్ జీ మహేంద్ర రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బంజారా ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్‌లో ఆదివారం 3వ లయన్స్ యోగా ఫెస్టివిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యోగా ద్వారా అనేక శారీరక, ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని, మానసికంగా ఎదురయ్యే అనేక ఒత్తిళ్ల నుంచి దూరం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా యోగా గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ యోగాచార్యులు ప్రొఫెసర్ టీ జయరామిరెడ్డి, రీజియన్ చైర్‌పర్సన్ ఉమాశంకర్, జోన్ చైర్మన్ మురళీకృష్ణ, అభయ బంజారా అధ్యక్షుడుఏ రాఘవేంద్ర, చార్టెండ్ ప్రెసిడెంట్ ఆదిరెడ్డి, ఎస్‌వీకేఆర్ సైంటిఫిక్ యోగా ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి పవన్‌కుమార్, ఆల్ దబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణ, యోగా టీచర్లు, సాధకులు పాల్గొన్నారు.



